సాక్షి
ఖమ్మం
బుధవారం । 24 । జూలై । 2024



ఏళ్ల తరబడి సాగుతూ...

మద్దులపల్లిలో వ్యవసాయ మార్కెట్ నిర్మాణ పనులు ఏళ్ల తరబడి సాగుతుండడంతో ఎప్పుడు పూర్తవుతుందో తెలియడం లేదు. IIలో



రైతు భూమిలో సర్వే

చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు ప్రభాకర్ భూమిని ప్రభుత్వ ఆదేశాలతో సర్వే చేశారు. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 25°

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

'సదరమ్' సర్టిఫికెట్‌కు 67 మంది అర్హత

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈమేరకు 160 మంది దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోగా 136 మంది హాజరయ్యారు. వీరికి వివిధ విభాగాల వైద్యులు పరీక్షలు నిర్వహించి 67 మందిని సర్టిఫికెట్‌కు అర్హులుగా నిర్ధారించారు.

నేటి నుంచి ఆర్టీసీలో ప్రమాదరహిత వారోత్సవాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో బుధవారం నుంచి ఈనెల 30 వరకు ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించనున్నట్లు రీజినల్ మేనేజర్ సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా జూలైలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని తొలిరోజు ఉన్నతాధికారులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ప్రమాదాల రహితంగా బస్సులు నడపంతో పాటు ఆస్తులకు నష్టం జరగకుండా చూసేలా ఉద్యోగులకు శిక్షణ ఉంటుందని తెలిపారు. అలాగే, ఆర్టీసీ, అద్దె బస్సుల డ్రైవర్లకు వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం పేర్కొన్నారు.

బెటాలియన్‌ను సందర్శించిన అడిషనల్ డీజీపీ



మొక్క నాటుతున్న అడిషనల్ డీజీపీ జైన్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక బెటాలియన్‌ను టీజీఎస్పీ బెటాలియన్ల అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ట్రైనింగ్ సెంటర్ కార్యాలయం, ఫైరింగ్ రేంజ్‌ను పరిశీలించిన ఆయన అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ మేరకు సమస్యలపై ఆరా తీసిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం అడిషినల్ డీజీపీ మొక్క నాటారు. బెటాలియన్ కమాండెంట్ చటర్జీ, అధికారులు పి.వెంకట్రాములు, తిరుపతి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అదనపు కలెక్టర్ తనిఖీ



కేజీబీవీలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డార్మిటరీలు, తరగతి గదులను పరిశీలించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలు, తరగతుల నిర్వహణ, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పంపిణీపై ఆరా తీశారు. అనంతరం భోజనశాల, స్టోర్‌రూంను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు మెరుగైన ప్రకారం భోజనం సమకూర్చాలని ఆదేశించారు. ఆతర్వాత సీహెచ్‌సీని సైతం తనిఖీ చేసిన మధుసూదన్ సీజనల్ వ్యాధుల నేపథ్యాన మెరుగైన చికిత్స అందించాలని తెలిపారు. అలాగే, మండలంలోని సుబ్లేడులో రమ గ్రానైట్ క్వారీ అనుమతులకు సంబంధించి పర్యావరణ శాఖ ఆధ్వర్యాన ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, పర్యావరణశాఖ ఈఈ రవీందర్ హాజరయ్యారు. తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ ఎస్‌ఐ గిరిధర్‌రెడ్డి, వివిధ సంస్థల తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి




వీసీలో పాల్గొన్న డీఏఓ, తదితరులు

వైరారూరల్: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించొచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి(డీఏఓ) విజయనిర్మల తెలిపారు. మండలంలోని ఖానాపురం రైతువేదికలో మంగళవారం 'రైతునేస్తం'లో కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలతో ముఖాముఖి ఏర్పాటుచేశారు. పత్తి, మిర్చి, వరి పంటల్లో తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాక డీఏఓ మాట్లాడారు. రైతు బీమా పథకంతో కలిగే ప్రయోజనాలను ఆమె తెలిపారు. అనంతరం పలు గ్రామాల్లోని ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఏఓ ఎస్.పవన్‌కుమార్, ఏఈఓలు, సైదులు, రాజేష్ పాల్గొన్నారు.

పర్వాలేదు కానీ...

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను జిల్లా వాసుల్లో కొందరు సంక్షేమ బడ్జెట్ అని చెబుతుండగా.. మరికొందరు మాత్రం ప్రత్యేకంగా పేదలు, జిల్లాకు ఒరిగిందేమీ లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఆదాయ పన్ను పరిమితి విషయంలో స్లాబ్ మార్పులు మినహా కొత్త అంశాలేమీ లేకపోవడంతో ఉద్యోగులు, వ్యాపారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇక బడ్జెట్‌లో పేర్కొన్నట్లు నిధులు కేటాయిస్తే జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇళ్లు, సోలార్ యూనిట్లు మంజూరవడంతో పాటు గ్రామీణ రహదారులకు నిధులు అందుతాయి. అలాగే, యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం దక్కనుంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



కేంద్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల భిన్నాభిప్రాయాలు

- ఆదాయ పన్నుపై ఉద్యోగులు, వ్యాపారుల్లో నిరాశ
- సింగరేణి కార్మికుల ఊసెత్తకపోవడంపై ఆవేదన
- రైతులు, మహిళలు, నిరుద్యోగులకు కొంత మేలు
- బంగారం ధరలు తగ్గనుండడంపై మధ్య తరగతి వర్గాల్లో ఆశలు

లక్షన్నర మందికి పైగా పన్ను చెల్లింపుదారులు..

ఆదాయ పన్ను విధానంలో స్లాబ్‌ల్లో సవరణలు తప్ప చెప్పుకోదగిన మార్పులేమీ లేవు. ఇది జిల్లాలోని ఉద్యోగులను కొంత నిరాశకు గురిచేసింది. రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు 5శాతం, రూ.7 లక్షల నుంచి 10 లక్షల వరకు 10శాతం, రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు 15శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అంతకన్నా మించితే 30 శాతం చెల్లించాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దాదాపు 1.60 లక్షల మంది వరకు పన్ను చెల్లింపుదారులు ఉన్నారు. వీరిలో కొందరు స్లాబ్ విధానం బాగుందనగా.. మరికొందరు మాత్రం పెదవి విరిచారు. ఆదాయపు పన్ను చెల్లించే వారిలో 30వేల మంది వ్యాపారులు, మరో 1.30లక్షల మంది ఉద్యోగులు, ఇతరులు ఉంటారు. అయితే, టీడీఎస్ నిబంధనలు సరళతరం చేయడం ఉద్యోగులకు ఊరట కలిగిస్తోంది.

ఇంటింటికీ 'సోలార్'

గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రకటించినట్లుగానే ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రస్తావించారు. ఈ పథకం ద్వారా రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. తద్వారా నెలకు 300 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ అందిస్తారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 4,28,315 మంది, భద్రాద్రి జిల్లాలో మూడు లక్షలకు మించి విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో దాదాపు 90 శాతం మంది 300 యూనిట్ల మేర విద్యుత్ వాడుతున్నారు. అయితే పథకం విధివిధానాలు పూర్తిస్థాయిలో వెల్లడైతే ఎందరికి లబ్ధి చేకూరుతుందో తేలనుంది.

సింగరేణికి మళ్లీ మొండిచేయే..

కేంద్ర బడ్జెట్‌లో సింగరేణి కార్మికుల ఆదాయపన్ను రద్దు ప్రస్తావన లేకపోవడం కార్మికులకు నిరాశను మిగిలిృంది. ప్రతీ ఎన్నికల్లో పార్టీల అభ్యర్థులు ఈ విషయాన్ని ప్రస్తావించడం ఆనవాయితీగా వస్తోంది. అంతేకాక గుర్తింపు సంఘం ఎన్నికల్లోనూ జాతీయ, ప్రాంతీయ కార్మిక సంఘాల నాయకులు హామీలు ఇస్తున్నారు. కానీ తాజా బడ్జెట్‌లో సింగరేణి కార్మికుల ఆదాయ పన్ను అంశం లేకపోవడంతో మరోమారు మొండిచేయి చూపినట్లయింది. సింగరేణి సంస్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏటా వివిధ రూపాల్లో పన్నులు చెల్లిస్తుండగా.. వందల అడుగుల లోతులో పనిచేసే కార్మికులకు ఆదాయపన్ను రద్దు చేయకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

ఉద్యోగులకు నిరాశే...



కేంద్ర బడ్జెట్ ఉద్యోగులకు నిరాశనే మిగిల్చింది. ఆదాయ పన్ను విషయంలో ఉద్యోగుల గొంతు కోసింది. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామన్న హామీని నిలబెట్టుకోలేదు. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేల నుంచి రూ.75 వేలకు పెంచినా ఫలితం లేదు. పెరిగిన ధరల ఆధారంగా ఆదాయ పన్నులో మినహాయింపులు ఇస్తే బాగుండేది.

– మోదుగు వేలాద్రి, టీజీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

విద్యారంగానికి దక్కని ప్రాధాన్యత



విద్యారంగానికి కేవలం 2.66 శాతమే కేటాయించడంతో కేంద్రప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత అర్థమైపోయింది. ఫలితంగా పేదలకు నాణ్యమైన విద్య అందే అవకాశం లేకపోగా ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నట్లుగా ఉంది. ఆదాయపు పన్ను మినహాయింపులు పెంచకపోవడం ఉద్యోగులకు నిరాశను మిగిల్చింది.

– పి.నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీపీటీఎఫ్

ప్రగతిని సూచిస్తున్న బడ్జెట్



కేంద్ర బడ్జెట్ ప్రగతిని సూచిస్తోంది. మధ్య, దీర్ఘ కాలిక వ్యాపారాభివృద్ధికి దోహదపడుతుంది. బ్యాంకు రుణాలతో నిర్వహించే ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వటం శుభపరిణామం. వ్యాపారాలను సరళతరం చేసుకునేలా బడ్జెట్ రూపొందించారు. రాష్ట్రానికి ఇంకొంత ప్రాధాన్యం పెంచితే బాగుండేది.

– గుర్రం ఉమామహేశ్వరరావు, ఎండీ, జీవీ మాల్

ఆశించిన ప్రయోజనం లేదు..



బడ్జెట్‌లో వ్యాపార రంగానికి ప్రాధాన్యత లేదు. గతంలో లేని విధంగా 15 ఏళ్లు దాటిన ఇళ్లు, ప్లాట్లపై 12.5 శాతం పన్ను విధించారు. బంగారం, లోహాల కొనుగోలుపై 15 శాతం మేర సుంకం తగ్గించడం ఉపశమనం కలిగించే అంశం. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇచ్చినా, రాష్ట్రానికి ఆశించిన ప్రాధాన్యత దక్కలేదు.

– చిన్ని కృష్ణారావు, అధ్యక్షుడు, చాంబర్ ఆఫ్ కామర్స్

అదొక్కటే ఊరట..



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసు లేకపోవడం బాధాకరం. అయితే రానున్న ఐదేళ్లలో 20 లక్షల మందికి నైపుణ్యాభివృద్ధిని పెంచుతామని పేర్కొనడం విశేషం. ప్రభుత్వ గ్యారంటీతో ఏటా 25 లక్షల మంది విద్యార్థులకు రూ.7.50 లక్షల రుణం ఇవ్వనుండడం ఊరట కలిగిస్తుంది. మొత్తంగా బడ్జెట్ తెలంగాణకు నిరాశనే మిగిల్చింది.

– ఎస్.వెంకన్న, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్

మరికొన్ని అంశాలు..



- వ్యవసాయ రంగం కోసం రూ.1.52 లక్షల కోట్లు కేటాయించగా.. ఉత్పాదకత, వాతావరణాన్ని తట్టుకునే వంగడాలను పెంచడంపై దృష్టి సారించేలా పరిశోధనలు జరగనున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లాలో కీలకమైన వ్యవసాయ రంగానికి మేలు చేసినట్లవుతుంది. నూతన వంగడాలు, పథకాల ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 6 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. అలాగే రైతుల భూరక్షణ కోసం డిజిటల్ భూ ఆధార్ ప్రవేశపెడుతున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు.
- నిరుద్యోగులకు బడ్జెట్‌లో పెద్దపీట వేస్తూ నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు సైతం ఉద్యోగాలు పొందే అవకాశం ఏర్పడుతుంది. అలాగే, యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా ఇచ్చే ముద్ర రుణాలను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచడం జిల్లాలోని నిరుద్యోగులతోపాటు యువ పారిశ్రామికవేత్తలకు మంచి అవకాశాలను కల్పిస్తుంది.
- ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం ద్వారా గ్రామాల్లోని రహదారులకు మహర్దశ పట్టనుంది. జిల్లాలోని కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉండగా, వర్షాకాలంలో మరింతగా దెబ్బతిన్నాయి. ఈ నిధులతో గ్రామాల్లో రహదారుల నిర్మాణం జరగనుంది.
- మహిళలు, బాలికల కోసం కొత్త పథకాలను ప్రకటించగా ఉమ్మడి జిల్లాలో దాదాపు 12లక్షల నుంచి 12.50 లక్షల మంది మహిళలకు లాభం చేకూరుతుంది. ఇక శ్రామికశక్తిలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. మహిళల పేరుతో ఆస్తులు కొనుగోలు చేస్తే స్టాంప్ డ్యూటీ తగ్గించాలని సిఫారసు చేస్తామన్న ప్రకటన తోనూ మేలు జరుగుతుంది.
- బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకం ఆరు శాతం తగ్గింది. దీంతో బంగారు ధరలు దిగిరానున్నందున వచ్చే శ్రావణమాసంలో బంగారం కొనుగోళ్లు ఊపందుకునే అవకాశముంది.
- పేదలకు గృహనిర్మాణాలు చేపట్టేందుకు కృతనిశ్చయంతో ఉన్నట్లు కేంద్రం బడ్జెట్‌లో పేర్కొంది. పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపడతామని ప్రకటించారు. ఈ పథకం ద్వారా కూడా జిల్లాలో పేదలకు గృహయోగం వరిస్తుంది.

మహిళలారా సిద్ధం కండి..

- త్వరలోనే ఇందిరా డెయిరీ ఏర్పాటు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన వివిధ శాఖల అధికారులు

ఎర్రుపాలెం: ఇందిరా డెయిరీ త్వరలో మొదలుకానున్నందున నిర్వహణకు స్వయం సహాయక సంఘాల సభ్యులు సిద్ధం కావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు, ఎర్రుపాలెం గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. తొలుత మండల కేంద్రంలోని అద్దె గదుల్లో నిర్వహిస్తున్న విజయ డెయిరీ మిల్క్ బల్క్ యూనిట్‌ను పరిశీలించిన ఆయన ప్రారంభానికి నోచుకోని గ్రామపంచాయతీ భవనాన్ని కేటాయించాలని అధికారులకు సూచించారు. ఆతర్వాత మీనవోలులోని నాలెడ్జ్ సెంటర్‌లో మొక్కలు నాటిన కలెక్టర్ మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఇంకా ఎవరైనా మిగిలితే సభ్యత్వాలు తీసుకోవాలని సూచించారు. తొలుత పాడి గేదెలు ఉన్న వారికే మరో రెండు గేదెల చొప్పున మంజూరు చేసి పాలు సేకరిస్తామని చెప్పారు. గ్రామాల్లో పాలసేకరణ కేంద్రాల ఏర్పాటు, రవాణా వాహనాలపై సమష్టిగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని 31 జీపీల్లో పాల ఉత్పత్తుల సేకరణకు ఇప్పటికే 18 గ్రామాలను గుర్తించామని, పాల సేకరణ కేంద్రం ఏర్పాటుకు రూ.1.50లక్షలు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మెరుగైన వసతులు కల్పించారని సభ్యులను అభినందించారు. అనంతరం డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య మాట్లాడగా పశు సంవర్ధక శాఖ జేడీఏ బి.వేణుమనోహర్, డీఎల్‌డీఏ ఈఓ కిశోర్, నాబార్డ్ ఏజీఎం సుజిత్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, మహిళా సమాఖ్యలు, డెయిరీ బాధ్యులు ఉషాశారద, సురేందర్‌నాయక్, వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వరరావు, కె.విజయభాస్కరరెడ్డి, రవీందర్, లక్ష్మణరావు, పండరీబాబు, సుహాసిని, అన్నపూర్ణ, అనిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కెపాసిటర్లు

- జిల్లాలో ఇప్పటికే 12చోట్ల ఏర్పాటు

ఖమ్మంవ్యవసాయం: మెరుగైన విద్యుత్ సరఫరా కోసం జిల్లాలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నారు. ఓవర్ లోడ్ కారణంగా ఎదురవుతున్న సమస్యలను నియంత్రించేందుకు ఎన్పీడీసీఎల్ కెపాసిటర్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తోంది. ఈమేరకు జిల్లాలో ఇప్పటివరకు 12 కెపాసిటర్లు ఏర్పాటు చేసినట్లు ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ ఏ.సురేందర్ తెలిపారు. మరో 15చోట్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని చెప్పారు. సరఫరాలో హెచ్చుతగ్గులు ఎదురుకాకుండా ఈ కెపాసిటర్లు ఉపయోగపడతాయని తెలిపారు. వీటితో పాటు 11 కేవీ లైన్లలో 600 కేవీఆర్ కెపాసిటర్లు అమర్చడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని, వ్యవసాయ పంపుసెట్లు, పారిశ్రామిక ఫీడర్లలో లోటల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోవడం వంటి సమస్యలు తగ్గుతున్నాయని వివరించారు. ఇదే సమయాన పారిశ్రామిక వినియోగదారులను సైతం కెపాసిటర్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నామని ఎస్‌ఈ తెలిపారు. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్లపై భారం తగ్గుతుందని వివరించారు.

శాంతించిన గోదావరి





భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి (ఇన్‌సెట్) కిన్నెరసాని, గోదావరి వరదతో నీటమునిగిన పంటలు

- స్వల్పంగా తగ్గుతున్న నీటిమట్టం
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- ముందస్తు చర్యలతో ఉపశమనం

భద్రాచలం: భద్రాచలం వద్ద గోదావరి స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. మంగళవారం వర్షం తెరపినివ్వడం, ఎగువ నుంచి వరద తీవ్రత లేకపోవడంతో గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. దీంతో మూడో ప్రమాద హెచ్చరిక అయిన 53 అడుగులకు వస్తుందని భావించినా.. ఉదయం 6 గంటలకు 51.6 అడుగుల మేరకు వచ్చిన వరద ఆగిపోయింది. రెండు గంటల పాటు నిలకడగా ఉండి, ఆ తర్వాత స్వల్పంగా తగ్గుతూ వస్తోంది. మధ్యాహ్నం ఒంటి గంటకు 51.2, సాయంత్రం 5 గంటలకు 50.50 అడుగులుగా నమోదైంది. రాత్రి 11 గంటలకు 49.30 అడుగుల మేర ప్రవాహం ఉంది. అయితే ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక మాత్రం కొనసాగుతూనే ఉంది. 48 అడుగుల కిందకు తగ్గితే రెండు, 43 అడుగులకు కిందకు వస్తే మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరిస్తారు.

కొనసాగుతున్న కరకట్ట నిర్మాణం..

రూ. 30 కోట్లతో కూనవరం రోడ్డు వైపు గోదావరి ఒడ్డున నిర్మిస్తున్న కరకట్ట నిర్మాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా పరిశీలించి వరదలు సంభవించే లోపు పూర్తి చేయాలని ఆదేశించినా పనులు పూర్తి కాలేదు. జాతీయ రహదారికి ఇరువైపులా పనులు దాదాపు పూర్తి కావచ్చినా రహదారిపై ఏర్పాటు చేయాల్సిన కరకట్టపై స్పష్టత రాకపోవడంతో ఆలస్యమైందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారి శాఖ అధికారులు ఫైనల్ చేసిన డిజైన్ ప్రకారం అక్కడ పూర్తి చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇంతలోనే గోదావరి ప్రవాహం పెరుగుతూ కూనవరం రోడ్డులో రహదారిపైకి వరద నీరు వస్తుందని భావించిన అధికారులు మంత్రుల ఆదేశాలతో జాతీయ రహదారిపై మట్టిని కరకట్టగా పోశారు. వరద నీరు కరకట్టను దెబ్బతీయకుండా ఇసుక బస్తాలు అడ్డు వేశారు. ఇటు వైపు నుంచి రోడ్డు లేకపోవడంతో ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు భద్రాచలం శివారు ప్రాంతంలోనే నిలిచిపోయాయి.

అప్రమత్తమైన యంత్రాంగం..

గోదావరి వరద మూడో ప్రమాద హెచ్చరిక సమీపానికి వచ్చినప్పటికీ ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీఓ బి రాహుల్ వరదలకు, జిల్లాకు కొత్తవారైనా అధికారులను అప్రమత్తం చేయడంలో సక్సెస్ అయ్యారు. వీరి సలహాలు, సూచనల మేరకు భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాల్లోని పునరావాస శిబిరాలను పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ముందుగానే మోటార్లు ఏర్పాటు చేసి కొత్తకాలనీ, విస్తా కాంప్లెక్స్ వద్ద మురుగు, వర్షపు నీటిని ఎత్తి గోదావరిలోకి పంపారు. ఎస్పీ రోహిత్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు కరకట్ట, గోదావరి ముంపు ప్రాంతాల వైపు ప్రజలు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఇలా అన్ని శాఖల అధికారుల చొరవతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయగలిగారు.

సార్.. మా పరిస్థితి ఏమిటి?!

రుణమాఫీ విభాగానికి ఫిర్యాదుల వెల్లువ

- కలెక్టరేట్‌లో మూడు బృందాల ఏర్పాటు
- ఆధార్ నంబర్‌తో పోర్టల్ ద్వారా వివరాల గుర్తింపు



పోర్టల్‌లో రుణమాఫీ వివరాలను రైతుకు వెల్లడిస్తున్న అధికారి

ఖమ్మంవ్యవసాయం: పంట రుణమాఫీ కాని రైతులు కారణాలేమిటో తెలుసుకునేందుకు కలెక్టరేట్, వ్యవసాయ కార్యాలయాలకు బారులుదీరుతున్నారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం తొలుత రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసింది. జిల్లాలో రూ.లక్ష లోపు 57,857 మంది రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు ప్రకటించినా చాలా మంది ఖాతాల్లో జమ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యాన రైతుల సందేహాలు నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేయడమే కాక టోల్ ఫ్రీ నంబర్లను ప్రకటించింది. దీంతో రైతులు కొందరు నేరుగా, మరికొందరు 1950, 90632 11298 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీస్తున్నారు.

సందేహాల నివృత్తి

రుణమాఫీ కాలేదంటూ పెద్ద సంఖ్యలో రైతులు వస్తుండడంతో కలెక్టరేట్‌లోని హెల్ప్‌డెస్క్‌లో వ్యవసాయ అధికారులతో మూడు బృందాలను ఏర్పాటుచేశారు. టి.అరుణజ్యోతి, అనసూయ బృందం నేరుగా వచ్చే రైతుల సందేహాలను నివృత్తి చేస్తోంది. మరోపక్క శరత్‌బాబు, రాము, మంద ప్రసాద్, బాలరాజు బృందాలు ఫోన్లు చేస్తున్న రైతులతో మాట్లాడి వివరాలు వెల్లడిస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా నోడల్ అధికారిగా జి.వినయ్‌కుమార్, డీఏఓ ఎం.విజయనిర్మల, ఏడీఏ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

ఎందుకు కాలేదంటే...

రుణమాఫీ స్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్ ఏర్పాటుచేసింది. రైతు ఆధార్ నంబర్ నమోదుచేస్తే ఆ రైతు కుటుంబం, భూమి, ఏ బ్యాంకులో రుణం తీసుకున్నారు, పాస్ బుక్ ఉందా, ఏదైనా ఉద్యోగం చేస్తున్నారా, పింఛన్ తీసుకుంటున్నారా అనేది తెలిసిపోతోంది. ఆపై రుణం మాఫీ ఎందుకు కాలేదో నిర్ధారిస్తున్నారు. ఈమేరకు మంగళవారం నాటికి వెయ్యి మంది ఫోన్ ద్వారా, 300మంది రైతులు నేరుగా సంప్రదించారని అధికారులు తెలిపారు. మరోపక్క రైతు వేదికల్లో ఏఈఓలు, ఇతర కార్యాలయాల్లో ఏఓలు, ఏడీఏలు, సిబ్బంది సైతం పోర్టల్ ఆధారంగా రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

క్లుప్తంగా

హెల్త్ వలంటీర్లను సత్కరించిన ఆర్టీసీ ఎండీ



సన్మానం అందుకున్న రీజియన్ వలంటీర్లతో ఎండీ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన సలహాలు ఇస్తున్న హెల్త్ వలంటీర్లను సంస్థ వైస్ చైర్మన్, ఎండీ వీ.సీ.సజ్జనార్ సత్కరించారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఖమ్మం రీజియన్‌కు చెందిన ఏడో డిపోల వలంటీర్లను ఎండీ సత్కరించి సూచనలు చేశారు. కాగా, డిపోల వారీగా వలంటీర్లు ఉద్యోగుల ఆరోగ్య స్థితిని తెలుసుకుని అవసరమైతే పరీక్షల కోసం పంపిస్తున్నారని.. వీరి సేవలకు గుర్తింపుగా ఎండీ సత్కరించారని రీజినల్ మేనేజర్ సరిరామ్ తెలిపారు.

40 మంది ఐసీడీఎస్ సిబ్బంది ఉద్యోగ విరమణ



రిలీవింగ్ ఆర్డర్లు అందుకున్న హెల్పర్లు, టీచర్లు

కల్లూరురూరల్: కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి కల్లూరు, పెనుబల్లి, తల్లాడ మండలాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు 40 మంది రిటైర్ అయ్యారు. ఇటీవల ప్రభుత్వం 65ఏళ్ల నిండిన వారికి రిటైర్‌మెంట్ ప్రకటించిన విషయం విదితమే. ఈమేరకు 35 మంది హెల్పర్లు, ఐదుగురు టీచర్లను ఈనెల 1నుంచి రిలీవ్ చేస్తున్నట్లు మంగళవారం సీడీపీఓ రహీమున్నీసాబేగం ఉత్తర్వులు అందచేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వీరికి నగదు అందుతుందని తెలిపారు.

లంబాడీ ఐక్యవేదిక ఇన్‌చార్జిగా బాలునాయక్



బాలునాయక్

కారేపల్లి: లంబాడీల ఐక్యవేదిక(లైవ్) భద్రాద్రి జోనల్(ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్) ఇన్‌చార్జిగా కారేపల్లి మండలం వెంకిట్యాతండాకు చెందిన బానోతు బాలునాయక్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనకు రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్‌జాదవ్ ఉత్తర్వులు అందజేశారు. అనంతరం బాలునాయక్ మాట్లాడుతూ లంబాడీల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, హక్కుల సాధనకు కృషి చేస్తానని తెలిపారు.

వాసవీ క్లబ్ పోటీల్లో ప్రతిభ

నేలకొండపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో నేలకొండపల్లి ప్రతినిధులు ప్రతిభ చాటారు. షటిల్, బ్యాడ్మింటన్, చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన సభ్యులు తమిళనాడులోని తిరుచ్చిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు కడవెండి శ్రీనివాస్, రేగూరి హన్మంతరావు, రేగూరి వాసవి, వల్లభ పరిమళ, గెల్లా మహేష్, గెల్లా భాను, కొత్తా కిరణ్ పాల్గొన్నారు.

తిప్పారెడ్డిగూడెంలో మూడు డెంగీ కేసులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాల తీవ్రత తగ్గడం లేదు. ఇన్నాళ్లు జల్లేపల్లిలో డెంగీ కేసులు పదుల సంఖ్యలో వెలుగుచూడగా ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నాయి. ఇంతలోనే తిప్పారెడ్డిగూడెంలో మూడు, అజ్మీరాతండా, జల్లేపల్లిలో ఒక్కొక్కరికి డెంగీ సోకినట్లు నిర్ధారణ అయింది. పారిశుద్ధ్య లోపంతోనే డెంగీ వ్యాప్తి చెందుతోందని వైద్యాధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, మండలంలోని పాతర్లపాడులో ప్రతీ ఇంట ఒకరిద్దరు జ్వరాల బారిన పడగా, అధికారులు ఇకనైనా పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని, వైద్యాధికారులు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి సోమవరం శివారు మామిడి తోటలో పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీల్లో పాల్గొనగా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.19,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,400	7,200
మిర్చి	17,000	8,300
మిర్చి తాలు	9,300	9,300
ఏసీ మిర్చి	19,300	9,500
ఏసీ తాలు	10,300	6,000
పత్తి	7,350	5,600

– ఖమ్మం వ్యవసాయం

ఏళ్ల తరబడి సాగుతూ..

- మద్దులపల్లి మార్కెట్ నిర్మాణంలో జాప్యం
- ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి
- రైతులకు అందుబాటులోకి వచ్చేదెప్పుడో?



మద్దులపల్లిలో నత్తనడకన సాగుతున్న మార్కెట్ నిర్మాణాలు

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లి వద్ద వ్యవసాయ మార్కెట్ నిర్మాణ పనులు అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా జరుగుతున్నాయి. పాలేరు నియోజకవర్గ రైతులు తాము పండించిన ఉత్పత్తులను దూర ప్రాంతాలకు తీసుకెళ్లే ఇబ్బంది లేకుండా స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు అప్పటి ప్రభుత్వం 2018లో మద్దులపల్లి వద్ద మోడల్ వ్యవసాయ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం 24 ఎకరాల భూమి కేటాయించి పాటు రూ.21 కోట్ల నిధులు మంజూరు చేశారు. అంతేకాకుండా ఆటోనగర్ నుండి పాస్నేకల్ వరకు బీటీ రహదారి సైతం మంజూరు చేశారు. రెండేళ్లలోపే నిర్మాణ పనులు పూర్తి చేసి రైతులకు మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తామని అప్పట్లో ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. కానీ శంకుస్థాపన జరిగి ఏళ్లు గడుస్తున్నా.. ప్రభుత్వం మారినా మార్కెట్ మాత్రం పూర్తికాలేదు. రెండేళ్లు ఏమో కానీ ఐదేళ్లు దాటినా నిర్మాణాల్లో పురోగతి లేకపోవడంతో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల పరిశీలించినప్పుడు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పనుల్లో వేగం పెంచాలని ఆయన ఆదేశించినా పురోగతి కానరావడం లేదు.

పూర్తయితే రైతులకు మేలు

ఖమ్మం నగరానికి సమీపాన మద్దులపల్లిలో నూతన వ్యవసాయ మార్కెట్ నిర్మాణం పూర్తయితే రైతులకు ప్రయోజనం కలగనుంది. ఈ మార్కెట్ నిర్మాణంతో ఖమ్మం మార్కెట్‌పై ఒత్తిడి తగ్గుతుంది. అలాగే, స్థానిక వ్యాపారులు, ఇతర వర్గాలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఖమ్మం వెళ్లే ఇక్కట్లు తీరి రైతులకు సమయం, రవాణా ఖర్చులు కలిసొస్తాయి. అంతేకాక ఖమ్మం మార్కెట్ వద్ద ట్రాఫిక్ ఇక్కట్లు తీరతాయి. మద్దులపల్లి మార్కెట్ పూర్తయితే ఇన్ని లాభాలు ఉన్నాయని తెలిసినా ఏళ్లుగా కాలయాపన చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

మరో ఆరు నెలలే గడువు.

రెండో సారి టెండర్‌లో పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం విధించిన మరో ఆరు నెలల్లోపూర్తవుతుంది. అయితే ఆలోగా పనులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. ఇప్పటికిప్పుడు రెట్టింపు వేగంతో చేస్తే తప్ప మార్కెట్‌లో నిర్మాణాలు పూర్తయి అందుబాటులో అవకాశం లేదని తెలుస్తోంది.

ఈ ఖరీఫ్‌కైనా ప్రారంభించండి..

రైతులు పండించిన పంట ఉత్పత్తులను ప్రస్తుతం ఖమ్మంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. దీంతో సమయం వృథా కావడమే కాక రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. అదే మద్దులపల్లి మార్కెట్ మొదలైతే పాలేరు నియోజకవర్గంతో పాటు పొరుగునే ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల రైతులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకుని మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టగా.. ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం 45శాతం పనులు మాత్రమే జరిగినందున త్వరగా పూర్తిచేసి ఖరీఫ్ పంట ఉత్పత్తులు చేతికొచ్చేనాటికైనా మార్కెట్‌ను ప్రారంభించాలని కోరుతున్నారు.

బడ్జెట్‌పై ఎవరేం అన్నారంటే..



పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే, బడ్జెట్‌పై జిల్లాలోని వివిధ పార్టీల నాయకులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. అలాగే, కొన్నివర్గాల ప్రజలు బడ్జెట్ ఆశాజనకంగా ఉందని వెల్లడించగా ఇంకొందరు మాత్రం కొత్త అంశాలేమీ లేవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

మధ్యతరగతిని విస్మరించారు..



మోడీ ఆలోచనలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారు తప్ప ప్రజల వైపు నుంచి ఆలోచించలేదు. ఎప్పటిలాగానే సంపన్న వర్గాలు, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాశారు. రాష్ట్రం ఊసెత్తకపోగా పేదల కోసం పథకాలు ప్రకటించలేదు. అంకెల మార్పే తప్ప లక్ష్యం మాత్రం పాతదే. పూర్తిగా ఇది ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్.

– పోటు ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి

తెలంగాణకు మొండిచేయి



మసిబూసి మారేడు కాయ చేసినట్లుగా బడ్కెజెట్ ఉంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై వివక్ష చూపారు. తెలంగాణకు పూర్తి అన్యాయం జరిగింది. ఆయం మొండిచేయి చూపారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, పంటలకు మద్దతు ధర ఊసే లేదు. మధ్య తరగతిని విస్మరించి కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా బడ్జెట్ రూపొందించారు.

– పోటు రంగారావు, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి

సంపన్నుల కోసమే బడ్జెట్..



కేంద్ర బడ్జెట్ సంపన్నుల కోసం ప్రవేశపెట్టినట్లుగా ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలు, యువతపై ఆలోచన చేయలేదు. వ్యవసాయరంగంలో కార్పొరేట్లను ప్రోత్సహిస్తున్నట్లు కనిపించింది. సంపన్నులు కొనుగోలు చేసే వస్తువులకు మాత్రమే రాయితీలు ప్రకటించి పేదలు వినియోగించే వస్తువులకు మాత్రం ఇవ్వలేదు. పన్ను చెల్లింపుదారులకు మేలు చేసేదిగా ఉంది.

– నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి

వికసిత్ భారత్ లక్ష్యంగా..



కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యంగా ఉంది. నిరుద్యోగులు, రైతులు, గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేశారు. యువతకు ఉపాధి కల్పన, పేదలకు ఇళ్ల కోసం నిధులు కేటాయించడం అభినందనీయం. బడ్జెట్‌లో ప్రధానమైన రంగాలపై మొగ్గు చూపుతూ పథకాలు ప్రవేశపెట్టడం, నిధులు కేటాయించడం సంతోషంగా ఉంది.

– గల్లా సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

తెలుగువారికి ద్రోహం



బడ్జెట్ తెలుగు ప్రజలు, తెలంగాణకు తీరని అన్యాయం చేసింది. విభజన హామీల అమలుకు నిధుల కేటాయింపు జరగలేదు. ఏపీ పేరును పలుమార్లు ప్రస్తావించినా నిధులు కేటాయించలేదు. మరోపక్క తెలంగాణ పదాన్నే బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణ నుండి బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా నిధులు దక్కకపోవడం అన్యాయం.

– ఆవుల అశోక్, మాస్‌లైన్ నాయకుడు

పైసా విదల్చలేదు....



బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపింది. గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తదితర పథకాలను నిధుల ప్రస్తావనే లేదు. విద్య, రైతాంగం, గ్రామీణాభివృద్ధికి కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయి. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం సరికాదు.

– పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి



సభ్యత్వాలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం సహకారనగర్: నాణ్యమైన విద్యనందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలను మంగళవారం నాయకులతో కలిసిసందర్శించిన ఆయన సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలు జరిగిన నేపథ్యాన విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలన్నారు. అయితే, టీచర్ పోస్టులన్నీ భర్తీ అయ్యే వరకు విద్యావలంటీర్లను నియమించాలని ఆయన అధికారులను కోరారు. ఈకార్యక్రమంలో ఎం.డీ.ఉస్మాన్ అలీ, కట్ట శేఖర్, పూనాటి వెంకటేశ్వర్లు, సోలా శ్రీనివాసరావు, శాంతారెడ్డి, సయ్యద్ షఫీ, డీ.వీ.రామన్, పుసులూరి శ్రీనివాసరావు, మాధవీలత, గౌతమి, రుక్మిణి, ఉమాకుమారి పాల్గొన్నారు.

చేపపిల్లల టెండర్లకు మరింత గడువు

ఖమ్మంవ్యవసాయం: చెరువుల్లో చేపపిల్లలు వదిలేందుకు సరఫరా చేసే వారి నుంచి టెండర్ల స్వీకరణ గడువు మరికొన్నాళ్లు పొడిగించారు. తొలుత నిర్దేశించినట్లు మంగళవారం మధ్యాహ్నం గడువు ముగియనుండగా, పలు జిల్లాల్లో ఆశించిన స్థాయిలో టెండర్లు నమోదు కాలేదని తెలిసింది. దీంతో వచ్చేనెల 2వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ఏడాది కాంట్రాక్టర్లకు ప్రభుత్వం సుమారు రూ.96 కోట్లు చెల్లించాల్సి ఉండడంతో ఈసారి వారు ముందుకు రాలేదని సమాచారం. దీంతో ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా వాయిదా వేసినట్లు తెలిసింది. కాగా, ఖమ్మం జిల్లాకు సంబంధించి ముగ్గురు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారని మత్స్యశాఖ అధికారి డి ఆంజనేయ స్వామి తెలిపారు.

విధుల నుంచి రిలీవ్

జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జి అధికారి డి.ఆంజనేయ స్వామి మంగళవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. ఇటీవల బదిలీల్లో ఆయన నిజామాబాద్ జిల్లా మత్స్యశాఖ అధికారిగా నియమితులయ్యారు. దీంతో ఆయన రిలీవ్ కాగా, జిల్లాకు కేటాయించిన జి.రాజనర్సయ్య బుధవారం ఇక్కడ విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

బల్బుల తయారీపై అవగాహన



ఎల్ఈడీ లైట్లు తయారుచేస్తున్న విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: పర్యావరణానికి హాని కలిగించని ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ) ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ ఇనుముల వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్వర్ తెలిపారు. ఖమ్మంలోని సైన్స్ మ్యూజియంలో మంగళవారం ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీపై అవగాహన కల్పించగా వారు మాట్లాడారు. జిల్లాలోని 509 పాఠశాలల్లో ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు ముగ్గురు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి ఎల్ఈడీ బల్బుల తయారీ, కంపోస్టు వినియోగంపై వివరించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు ఆదిత్యకుమార్, ఊటుపూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. ఒకరి మృతి



ధర్మారావు (ఫైల్)



బోల్తాపడిన కూరగాయల వ్యాన్

కొణిజర్ల: బొలేరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఎదురుగా మరో వాహనం వచ్చేసరికి బొలేరోకు తాకించడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో బొలేరోలో ప్రయాణిస్తున్న కూరగాయల వ్యాపారి మృతి చెందిన ఘటన కొణిజర్ల సమీపాన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ జె.శంకరరావు, ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం... మధిరకు చెందిన గోరింట్ల వెంకట్ తన బొలేరోలో ఖమ్మం నుంచి కూరగాయల లోడ్‌తో మధిర వెళ్తున్నాడు. కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖమ్మం నుంచి భద్రాచలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ బొలేరోను అధిగమిస్తూ ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించే క్రమాన ఎడమ వైపుకు తిరగడంతో బస్సు వెనక భాగం తాకింది. ఈ ఘటనలో బొలేరో అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి రెండు పల్టీలు కొట్టడంతో డ్రైవర్ వెంకట్, అందులో ప్రయాణిస్తున్న ఎర్రబోలు ధర్మారావు(51)పై పడగా ధర్మారావు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మధిర మండలం జీలుగుమాడుకు చెందిన ఆయన మధిరలో కూరగాయల దుకాణం నిర్వహిస్తుండగా భార్య కృష్ణకుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై ధర్మారావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకరరావు తెలిపారు.

27, 28 తేదీల్లో ఏబీఏపీ కార్యవర్గ సమావేశాలు

ఖమ్మంఅర్బన్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ (ఏబీఏపీ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఖమ్మంలో ఈ నెల 27న నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి టీవీ పుల్లంరాజు తెలిపారు. అలాగే, 28వ తేదీన జాతీయ కార్యవర్గ సమావేశం కూడా ఇక్కడే జరుగుతుందని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ కార్యవర్గ సమావేశాలకు ఏబీఏపీ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అయ్యప్పదాస్, బెల్లపు హరిప్రసాద్‌తో పాటు వివిధ రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకుంటామని వివరించారు.

రైతు వ్యవసాయ భూమిలో సర్వే



రైతు భూమిని సర్వే చేస్తున్న అధికారులు

చింతకాని: భూవివాదం కారణంగా మండలంలోని ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా.. ఆయన వ్యవసాయ భూమిని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు మంగళవారం సర్వే చేశారు. తన వ్యవసాయ భూమిని మత్స్య కార్మికులు ధ్వంసం చేశారని ఆరోపిస్తూ ఆయన ఈనెల 1వ తేదీన ప్రభాకర్ ఆత్మహత్య చేసుకోగా, రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈనేపథ్యాన సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో ప్రభాకర్, ఆయన తండ్రి పెద్దవీరయ్యకు చెందిన 7.10 ఎకరాల భూమిని సర్వే చేశారు. ఈసందర్భంగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయగా, తహసీల్దార్ రమేష్, ఇరిగేషన్ డీఈ రాంప్రసాద్, జేఈ సురేష్, ఎస్సై నాగుల్‌మీరా, డీఐ లూర్దు పాల్గొన్నారు.

వందనంలో యువకుడు ఆత్మహత్య

- ప్రేమికురాలి మృతితో మనస్తాపం



సతీష్ (ఫైల్)

చింతకాని: మండలంలోని వందనంకు అమర్లపూడి సతీష్ (24) ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సతీష్‌కు ఇన్‌స్టాగామ్‌లో ప్రవల్లిక అనే యువతి పరిచయం కాగా రెండేళ్ల నుంచి వారు ప్రేమించుకుంటున్నారు. అయితే, కేన్సర్ బారిన పడిన ప్రవల్లిక రెండు వారాల క్రితం మృతి చెందింది. దీంతో సతీష్ మనస్తాపానికి గురై తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయాన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, సతీష్ బీ ఫార్మసీ పూర్తి చేయగా, ఆయన తండ్రి రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నర్సింహారావు (ఫైల్)

రఘునాథపాలెం: విద్యుదాఘాతంతో యువ రైతు మృతి చెందిన ఘటన రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ముత్తంశెట్టి నర్సింహారావు(27) తనకు ఉన్న రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. వర్షం కాస్త తెరిపినివ్వడంతో మంగళవారం ఉదయం చేనులో కలుపు మందు కొట్టేందుకు వెళ్లిన ఆయన నీళ్ల కోసం బోరు మోటార్ వేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, నర్సింహారావుకు భార్య, ఆరు నెలల కుమార్తె ఉన్నారు. అంతసేపటి వరకు భార్యాబిడ్డలతో గడిపిన ఆయన కాసేపటికి మృతి చెందినట్లు సమాచారం అందడంతో కన్నీరుమున్నీరుగా రోదించారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

జ్వరంతో ఆరేళ్ల బాలుడు..

తిరుమలాయపాలెం: జ్వరంతో బాధపడుతున్న ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన గొలుసు ఉమేష్ – స్వాతి కుమారుడు హర్షిత్(6)కు సోమవారం ఉదయం తీవ్ర జ్వరంతో పాటు ఫిట్స్ వచ్చాయి. దీంతో తల్లిదండ్రులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యుల సూచనలతో హైదరాబాద్ తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. కాగా, హర్షిత్ మృతితో ఉమేష్ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

కారేపల్లి: మానసిక వేదనతో మద్యానికి బానిసైన వ్యక్తి పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని భీక్యాతండాకు చెందిన ధరావత్ ప్రశాంత్(23) మేకల బేరం చేసేవాడు. కొన్నాళ్లుగా మానసికవేదనకు గురవుతున్న ఆయన మద్యానికి బానిస కాగా, జీవితంపై విరక్తితో ఈనెల 15న గ్రామ శివార్లలో పురుగుల మందు తాగి కుటుంబీకులకు ఫోన్ చేశాడు. దీంతో వారు ప్రశాంత్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు ఉన్నారని ఎస్‌ఐ ఎస్.రాజారాం తెలిపారు.

గాయపడిన మహిళ..

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారానికి చెందిన యడవల్లి శ్రీలక్ష్మి(50) మూడు రోజుల క్రితం ఇంట్లోని బాత్‌రూమ్‌లో కాలుజారి పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయం కాగా హైదరాబాద్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. శ్రీలక్ష్మికి భర్త, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

27లోగా ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీలతో జిల్లాలోని 60 పాఠశాలల్లో సుమారు 150మంది సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడింది. హైస్కూళ్లలో బయాలజీ, హిందీ, సోషల్ టీచర్ల కొరత ఉందని గుర్తించిన అధికారులు పరిష్కారంపై దృష్టి సారించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో అప్‌గ్రేడ్ అయిన ఆరు పాఠశాలలకు సుమారు 20మంది టీచర్లకు ఈనెల 22వ తేదీన కేటాయించగా అందులో పలువురు విధుల్లో చేరారు. మరో 40పాఠశాలల్లో అసలు సబ్జెక్ట్ టీచర్లే లేకపోవడంతో ఇతర పాఠశాలల్లో అదనంగా ఉన్న 80మంది వరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. మొత్తంగా ఈ ప్రక్రియను 27వ తేదీలోగా పూర్తిచేసేలా కసరత్తు జరుగుతోందని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు.

ప్రేమించి పెళ్లికి నిరాకరించాడని ఫిర్యాదు

ఇల్లెందురూరల్/ఇల్లెందు: ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని ఓ వ్యక్తి తనను మోసం చేశాడని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొమరారం ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన ఇస్లావత్ అనిల్ బీటెక్ చదువుతున్న క్రమంలో ఖమ్మంలో డిగ్రీ చదువుతున్న మండలానికి చెందిన యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించాడు. చదువు పూర్తయ్యాక అనిల్ పెళ్లికి నిరాకరించడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. అయినా అనిల్ పెళ్లికి అంగీకరించకపోవడంతో మంగళవారం యువతి కొమరారం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమేశ్వర్ వెల్లడించారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని బోనకల్లు రోడ్డు ధంసలాపురం రైల్వే క్రాసింగ్ వంతెన వద్ద రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన వెచ్చా కొండలరావు ఈనెల10న ఖమ్మంలో పని ముగించుకుని కారులో ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కొండలరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇన్నాళ్లు చికిత్స పొందిన ఆయన మంగళవారం ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

సత్తుపల్లిరూరల్: లారీలో అక్రమంగా తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సిద్ధారం నుంచి బాలాజీ అనే వ్యక్తి లారీలో రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని ఏపీలోని పుట్రాలలోని కోళ్లఫాంలకు తరలిస్తున్నాడు. ఈమేరకు అందిన సమాచారంతో పోలీసులు లారీని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు... 'ఖేలో ఇండియా'కే రూ. 900 కోట్లు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం క్రీడలకు ఇచ్చే వార్షిక బడ్జెట్‌ను స్వల్పంగా పెంచింది. మంగళవారం ప్రకటించిన 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో క్రీడలకు రూ. 3,442.32 కోట్లు కేటాయించింది. గత ఏడాది ఇచ్చిన రూ.3,396.96 కోట్లతో పోలిస్తే ఇది రూ.45.36 కోట్లు ఎక్కువ. ఎప్పటిలాగే ఇందులో ఎక్కువ మొత్తం దిగువ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి తీర్చిదిద్దే 'ఖేలో ఇండియా' పథకానికే కేటాయించింది. గత ఏడాదికంటే రూ.20 కోట్లు ఎక్కువగా 'ఖేలో ఇండియా'కు ఈసారి రూ.900 అందిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ పథకంలో భాగంగా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్‌ల నిర్వహణతో పాటు అత్యుత్తమ స్థాయి శిక్షణ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ఏర్పాటు, అక్కడ సౌకర్యాల కల్పన కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేస్తారు. మరోవైపు దేశవ్యాప్తంగా స్టేడియాల నిర్వహణ, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) కోసం ఖర్చు చేసేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కు ప్రభుత్వం రూ.822.60 కోట్లు కేటాయించింది. దేశంలోని వివిధ క్రీడా సమాఖ్యలకు ఈ సారి రూ.340 కోట్లు అందజేస్తున్నారు. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా), జాతీయ డోపింగ్ టెస్టింగ్ లేబొరేటరీ (ఎన్‌డీటీఎల్)ల కోసం వరుసగా 21.73 కోట్లు, రూ. 22 కోట్లు చొప్పున కేటాయించారు.

అజేయంగా సెమీస్‌లోకి

- భారత మహిళల జట్టుకు 'హ్యాట్రిక్' విజయం
- రాణించిన షఫాలీ వర్మ, హేమలత, అరుంధతి


షఫాలీ

దంబుల్లా: అటు బ్యాటింగ్‌లో... ఇటు బౌలింగ్‌లో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు ఆసియా కప్ టి20 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. నేపాల్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 82 పరుగుల తేడాతో గెలిచింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత జట్టు ఆరు పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి తీసుకోవడంతో వైస్ కెప్టెన్ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించింది. టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 178 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (48 బంతుల్లో 81; 12 ఫోర్లు, 1 సిక్స్), హేమలత (42 బంతుల్లో 47; 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 122 పరుగులు జోడించారు. 179 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లు పడగొట్టగా... హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి, రాధా యాదవ్ 2 వికెట్ల చొప్పున తీశారు. గ్రూప్ 'ఎ'లోని మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ 10 వికెట్ల తేడాతో యూఏఈ జట్టును ఓడించింది. 4 పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో రెండో స్థానంతో పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరుకుంది. నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో మలేసియాతో బంగ్లాదేశ్; థాయ్‌లాండ్‌తో శ్రీలంక తలపడతాయి.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (స్టంప్డ్) కాజల్ శ్రేష్ఠ (బి) సీతా రాణా మగర్ 81; హేమలత (సి) రుబీనా ఛెత్రి (బి) సీతా రాణా మగర్ 47; సజన (ఎల్బీడబ్ల్యూ) (బి) కబితా జోషి 10; జెమీమా రోడ్రిగ్స్ (నాటౌట్) 28; రిచా ఘోష్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1-122, 2-133, 3-156. **బౌలింగ్:** కబితా కున్వర్ 2-0-20-0, షబ్నమ్ రాయ్ 4-0-41-0, పూజా మహతో 1-0-13-0, కబితా జోషి 4-0-36-1, రుబీనా ఛెత్రి 1-0-14-0, ఇందూ బర్మ 4-0-29-0, సీతా రాణా మగర్ 4-0-25-2. **నేపాల్ ఇన్నింగ్స్:** సంజానా ఖాద్కా (బి) అరుంధతి రెడ్డి 7; సీతా రాణా మగర్ (బి) అరుంధతి రెడ్డి 18; కబితా కున్వర్ (సి) స్మృతి మంధాన (బి) రేణుక 6; ఇందూ బర్మ (సి) షఫాలీ (బి) రాధా యాదవ్ 14; రుబీనా ఛెత్రి (బి) దీప్తి శర్మ 15; పూజా మహతో (రనౌట్) 2; కబితా జోషి (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 0; బిందూ రావల్ (నాటౌట్) 17; డాలీ భట్టా (సి) రిచా ఘోష్ (బి) రాధా యాదవ్ 5; కాజల్ శ్రేష్ఠ (సి అండ్ బి) దీప్తి శర్మ 3; షబ్నమ్ రాయ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 96. వికెట్ల పతనం:** 1-8, 2-21, 3-43, 4-52, 5-64, 6-64, 7-70, 8-82, 9-93. **బౌలింగ్:** రేణుక సింగ్ 4-1-15-1, అరుంధతి రెడ్డి 4-0-28-2, తనూజా కన్వర్ 4-1-12-0, దీప్తి శర్మ 4-0-13-3, రాధా యాదవ్ 3-0-12-2, సజన 1-0-11-0.



ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు పారిస్‌కు చేరుకున్నారు. భారత మహిళా బాక్సర్లు నిఖత్ జరీన్, లవ్లీనా, ప్రీతి, జైస్మీన్... బ్యాడ్మింటన్ స్టార్ సాత్విక్ సాయిరాజ్ అక్కడి ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. క్రీడా గ్రామంలో టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్‌ను సాత్విక్ సాయిరాజ్, భారత టీటీ ప్లేయర్ సత్యన్ జ్ఞానశేఖరన్ కలిసి అతనితో ఫొటోలు దిగారు.



వీళ్ల ఆటను చూడాల్సిందే!

పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు దిగ్గజాలు • చరిత్ర సృష్టించేందుకు సిద్ధం

జీవితంలో ఒక్కసారి ఒలింపిక్స్‌లో పోటీపడితేనే తమ జీవితాశయం నెరవేరినట్లు చాలా మంది క్రీడాకారులు భావిస్తారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని కొందరు జాతీయ హీరోలుగా ఎదుగుతారు. ఒలింపిక్స్ పేరును ఎప్పుడు ప్రస్తావించినా తమ పేరును కూడా స్మరించుకునే విధంగా చరిత్రకెక్కుతారు. తమ అద్వితీయమైన ప్రదర్శనతో తమకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖిస్తారు. ఒలింపిక్స్‌లో పోటీపడటాన్ని... పతకాలను సాధించడాన్ని... ప్రపంచ రికార్డులు సృష్టించడాన్ని అలవాటుగా మార్చుకొని ఎవరికీ అందనంత ఎత్తులో నిలుస్తారు. మరో రెండు రోజుల్లో మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లోనూ పలు క్రీడాంశాల్లో దిగ్గజాలు మరోసారి తమ విన్యాసాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. అందులో కొందరి గురించి క్లుప్తంగా...

-సాక్షి క్రీడా విభాగం



మరో 2 రోజుల్లో...

సిమోన్ బైల్స్ (జిమ్నాస్టిక్స్)

మెరుపు తీగలా కదులుతూ... అలవోకగా పతకాలు గెలుస్తూ... ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో తనదైన ముద్ర వేసింది అమెరికాకు చెందిన సిమోన్ బైల్స్. 27 ఏళ్ల బైల్స్ వరుసగా మూడో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనుంది. 4 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న బైల్స్ ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో 4 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 23 స్వర్ణాలు, 4 రజతాలు, 3 కాంస్యాలు కైవసం చేసుకుంది. 'పారిస్'లో బైల్స్ మరో పతకం నెగ్గితే ఒలింపిక్స్ చరిత్రలో అత్యధిక పతకాలు నెగ్గిన అమెరికన్ జిమ్నాస్ట్‌గా రికార్డు నెలకొల్పుతుంది. బైల్స్ ఐదు పతకాలు గెలిస్తే... ఒలింపిక్స్ చరిత్రలోనే 12 పతకాలతో అత్యధిక పతకాలు నెగ్గిన జిమ్నాస్ట్‌లలో లారిసా లాతినినా (రష్యా; 18 పతకాలు) తర్వాత రెండో స్థానానికి చేరుకుంటుంది.

ఎలూడ్ కిప్‌చోగి (అథ్లెటిక్స్)



లాంగ్ డిస్టెన్స్ రన్నింగ్‌లో ఆఫ్రికా అథ్లెట్లకు తిరుగులేదు. పారిస్ ఒలింపిక్స్‌లో కెన్యాకు చెందిన 39 ఏళ్ల ఎలూడ్ కిప్‌చోగి గతంలో మారథాన్‌లో ఎవరికీ సాధ్యంకాని రికార్డును సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నాడు. ఐదోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న కిప్‌చోగి 2004 ఏథెన్స్ గేమ్స్‌లో 5000 మీటర్లలో కాంస్యం, 2008 బీజింగ్ గేమ్స్‌లో 5000 మీటర్లలో రజతం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌కు అర్హత పొందలేకపోయిన కిప్‌చోగి ఆ తర్వాత మారథాన్ (42.195 కిలోమీటర్లు) వైపు మళ్లాడు. 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కిప్‌చోగి విజేతగా నిలిచి రెండు స్వర్ణాలు సాధించాడు. ఈ క్రమంలో అబెబె బికిలా (ఇథియోపియా), వాల్డెమర్ (జర్మనీ) తర్వాత ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో రెండు స్వర్ణాలు నెగ్గిన మూడో అథ్లెట్‌గా నిలిచాడు. పారిస్‌లోనూ కిప్‌చోగి పతకం లేదా స్వర్ణం నెగ్గితే ఒలింపిక్స్ మారథాన్ చరిత్రలో అత్యధికంగా మూడు పతకాలు నెగ్గిన ఏకైక అథ్లెట్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

లెబ్రాన్ జేమ్స్ (బాస్కెట్‌బాల్)



ఒలింపిక్స్‌లో బాస్కెట్‌బాల్‌ను 1936 బెర్లిన్ ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ క్రీడాంశంలో అమెరికాయే తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 1980 మాస్కో ఒలింపిక్స్‌ను బహిష్కరించిన అమెరికా జట్టు ఇప్పటి వరకు బాస్కెట్‌బాల్‌లో 16 స్వర్ణాలు, 1 రజతం, 2 కాంస్యాలు గెలిచింది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం నెగ్గిన అమెరికా ఆ తర్వాత వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణాలు సాధించింది. మరో స్వర్ణమే లక్ష్యంగా అమెరికా పారిస్ గేమ్స్‌లో అడుగు పెడుతుంది. నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ (ఎన్‌బీఏ) లీగ్ చరిత్రలో టాప్ స్కోరర్‌గా ఉన్న లెబ్రాన్ జేమ్స్ నాలుగోసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్నాడు. 2012 లండన్ ఒలింపిక్స్ తర్వాత మళ్లీ విశ్వ క్రీడల్లో ఆడుతున్న లెబ్రాన్ జేమ్స్ తన సహజశైలిలో ఆడితే ఈసారీ అమెరికాకు ఎదురుండదు.

మిజైన్ లోపెజ్ నునెజ్ (రెజ్లింగ్)



గ్రీకో రోమన్ స్టయిల్‌లో ఎదురులేని దిగ్గజ రెజ్లర్. క్యూబాకు చెందిన 41 ఏళ్ల నునెజ్ వరుసగా ఆరో ఒలింపిక్స్‌లో పోటీపడుతున్నాడు. ఇప్పటికే వరుసగా నాలుగు ఒలింపిక్స్‌లలో స్వర్ణ పతకాలను సాధించాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న నునెజ్ పురుషుల గ్రీకో రోమన్ 130 కేజీల విభాగంలో మరోసారి టైటిల్ ఫేవరెట్‌గా ఉన్నాడు. 2004 ఏథెన్స్‌లో 120 కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచిన నునెజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లలో 120 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలు సాధించాడు. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లలో 130 కేజీల విభాగంలో స్వర్ణ పతకాలను గెల్చుకున్నాడు. పారిస్ గేమ్స్‌లోనూ నునెజ్ పతకం సాధిస్తే... ఒలింపిక్స్ రెజ్లింగ్ చరిత్రలో ఐదు స్వర్ణాలు లేదా ఐదు పతకాలు నెగ్గిన ఏకైక రెజ్లర్‌గా ఘనత వహిస్తాడు.

టెడ్డీ రైనర్ (జూడో)



పురుషుల జూడో క్రీడాంశంలో 12 సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన ఫ్రాన్స్ దిగ్గజం టెడ్డీ రైనర్ సొంతగడ్డపై రికార్డుపై గురి పెట్టాడు. వరుసగా ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న 35 ఏళ్ల టెడ్డీ రైనర్ ఒలింపిక్స్‌లో 3 స్వర్ణాలు, 2 కాంస్యాలు సాధించాడు. 6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న టెడ్డీ పారిస్ ఒలింపిక్స్‌లో మిక్స్‌డ్ టీమ్‌తోపాటు హెవీ వెయిట్ విభాగంలో బరిలోకి దిగుతాడు. ఈ రెండు విభాగాల్లోనూ టెడ్డీ స్వర్ణాలు సాధిస్తే ఫ్రాన్స్ తరఫున ఒలింపిక్స్ క్రీడల్లో అత్యధికంగా ఐదు స్వర్ణాలు గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఫ్రాన్స్ ఫెన్సర్లు లూసియన్ గాడిన్, క్రిస్టియన్ డోరియోలా గతంలో ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణాల చొప్పున సాధించారు.

బైల్స్, లెబ్రాన్ జేమ్స్, కెప్‌చోగి, టెడ్డీ రైనర్, నునెజ్‌లే కాకుండా పోల్‌వాల్టర్ డుప్లాంటిస్ (స్వీడన్), టేబుల్ టెన్నిస్‌లో మా లాంగ్ (చైనా), స్విమ్మింగ్‌లో సెలెబ్ డ్రెసెల్ (అమెరికా), కేటీ లెడెకీ (అమెరికా) కూడా పారిస్ ఒలింపిక్స్‌లో కొత్త చరిత్రను లిఖించే దారిలో ఉన్నారు. వారందరికీ ఆల్ ద బెస్ట్!

సినిమా

రెప్పల్ డప్పల్


రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రధారులు. పనోరమా స్టూడియోస్ అండ్ టి–సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'రెప్పల్ డప్పల్...' అంటూ సాగే రెండో పాట లిరికల్ వీడియోను ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

మళ్లీ ఎటో వెళ్లిపోయింది మనసు...

ప్రేమకథలను ఇష్టపడే వారి జాబితాలో 'ఎటో వెళ్లిపోయింది మనసు' (2012) సినిమా కూడా ఉంటుంది. నాని, సమంత లీడ్ రోల్స్‌లో నటించగా, గౌతమ్ వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించిన చిత్రం ఇది. రేష్మా, ఎస్. వెంకట్, సి. కల్యాణ్, సీవీ రావు నిర్మించిన ఈ సినిమాకు ఇళయరాజా అందించిన బాణీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా 'ఎటో వెళ్లిపోయింది మనసు' సినిమా రీ రిలీజ్ కానుంది. లక్ష్మీ నరసింహా మూవీస్ బ్యానర్ మీద సుప్రియ, శ్రీనివాస్ ఆగస్టు 2న ఈ సినిమాను మళ్లీ విడుదల చేయనున్నారు. ''ప్రస్తుతం తెలుగులో రీ–రిలీజ్‌ల ట్రెండ్ నడుస్తోంది. ఈ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు నిర్మాతలు.


సమంత
నాని

మరో ప్రేమకథ ఆరంభం


నయనతార

ఇప్పటివరకూ పలు ప్రేమకథా చిత్రాల్లో నటించారు నయనతార. తాజాగా సిల్వర్ స్క్రీన్‌పై మరో రొమాంటిక్ లవ్ స్టోరీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారీ బ్యూటీ. తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ దగ్గర అసిస్టెంట్‌గా చేసిన విష్ణు ఎడవన్ ఈ న్యూ ఏజ్ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్య వయస్కురాలైన ఓ మహిళ, ఓ కుర్రాడి మధ్య ఉన్న ప్రేమ బంధాన్ని నేటి సమాజం ఎలా చూస్తుంది? అనేది ఈ చిత్రం ప్రధానాంశమని కోలీవుడ్ సమాచారం. మధ్యవయస్కురాలి పాత్రలో నయనతార, కుర్రాడి పాత్రలో కెవిన్ కనిపిస్తారు. ప్రస్తుతం నయనతార, కెవిన్ పాల్గొంటుండగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు విష్ణు. లలిత్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.

మేమే... మేమే...



సూర్య

'ఆది జ్వాల... అనంత జ్వాల... వైర జ్వాల... వీర జ్వాల.. దైవ జ్వాల... దావాగ్ని జ్వాల...' అంటూ మొదలవుతుంది 'కంగువా' సినిమాలోని ఫైర్ సాంగ్. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందిన పీరియాడికల్ ఫిల్మ్ ఇది. ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించగా, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 10న విడుదల కానుంది. మంగళవారం సూర్య బర్త్ డే సందర్భంగా 'కంగువా' సినిమాలోని 'ఫైర్ సాంగ్' లిరికల్ వీడియోను విడుదల చేశారు. ''ఈ మట్టి ముట్టే ముందే ఇక్కడ పుట్టింది మేమే మేమే... అంకెలు పుట్టక ముందే లెక్కలు కనిపెట్టింది మేమే మేమే...' అనే లిరిక్స్‌తో సాగే ఈ పాట తెలుగు వెర్షన్‌కు శ్రీమణి సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, దీప్తీ సురేష్ ఆలపించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

ది వన్... హీరో సూర్య, దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్య బర్త్ డే సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్ వీడియోలో 'ది వన్' అని ఉంది. దాంతో ఈ సినిమా టైటిల్ 'ది వన్' అనే ప్రచారం జరుగుతోంది. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రాన్ని జ్యోతిక, సూర్య, కార్తీక్ సుబ్బరాజు నిర్మిస్తున్నారు.

అశ్విన్ కెరీర్‌లో శివం భజే నిలిచిపోతుంది - విశ్వక్ సేన్


అనిల్ రావిపూడి, విశ్వక్ సేన్, అశ్విన్‌బాబు, తమన్

''శివం భజే' ట్రైలర్ బాగుంది. నేపథ్య సంగీతం అదిరిపో యింది. ఆగస్టు 1న అశ్విన్‌కు బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులు సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాను. తన కెరీర్‌లో 'శివం భజే' నిలిచిపోతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జోడీగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శివం భజే'. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదలవుతోంది. మంగళవారం జరిగిన 'శివం భజే' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి విశ్వక్ సేన్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, సంగీత దర్శకుడు తమన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''శివం భజే' ట్రైలర్ బాగుంది. యూనిట్‌కి ఈ చిత్రం మంచి విజయాన్ని అందించాలి'' అన్నారు అనిల్ రావిపూడి. ''అశ్విన్ క్రికెట్‌లో బాల్‌ను ఎలా బాదుతాడో బాక్సాఫీస్‌ను కూడా అలానే బాదాలి'' అన్నారు తమన్. ''పరమేశ్వరుడి కథతో రూపొందిన ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు అప్సర్. ''ముస్లిం అయిన అప్సర్‌గారు 'శివం భజే' లాంటి కథను ఎలా రాశారో అనుకున్నాను. ఇదంతా శివ లీల అనిపించింది'' అని అన్నారు అశ్విన్‌బాబు.

ఆ ఫైర్‌తో డైరెక్టర్ అయ్యా! - బండి సరోజ్ కుమార్



''నేను గతంలో 'నిర్బంధం, నిర్బంధం 2 , మాంగల్యం' వంటి సినిమాలు తీశాను. వాటిని కొన్ని వర్గాల ప్రేక్షకులు మాత్రమే చూశారు. కానీ 'పరాక్రమం' చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు చూడొచ్చు'' అని బండి సరోజ్ కుమార్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన సినిమా 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, నాగ లక్ష్మి, మోహన్ సేనాపతి, నిఖిల్ గోపు, అనిల్ కుమార్ ఇతర పాత్రల్లో నటించారు. బీఎస్‌కే మెయిన్ స్ట్రీమ్ పతాకంపై రూపొందిన ఈ మూవీ ఆగస్టు 22న విడుదల కానుంది. బండి సరోజ్ కుమార్ మాట్లాడుతూ– ''సంఘర్షణతో కూడుకున్న కథే 'పరాక్రమం'. నేను ఇండస్ట్రీకి రాక ముందు ఓ హాస్టల్‌లో ఉండేవాణ్ని. ఓ రోజు క్రికెట్ ప్రాక్టీస్ చేస్తుంటే.. 'క్రికెటర్ అవుతావా? మీ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? వెనక చూసి ముందుకు వెళ్లాలి బ్రదర్' అని ఓ వ్యక్తి అన్న మాటలు నాలో కసిని నింపాయి. ఏదో ఒకరోజు అతను నన్ను తలెత్తుకుని చూడాలనుకున్నాను.. ఆ ఫైర్‌తోనే డైరెక్టర్ అయ్యాను'' అన్నారు.

నాలుగువందల ఏళ్ల నాటి గుడి కథతో...


బెల్లంకొండ సాయిశ్రీనివాస్

ఓ పురాతన గుడి ముందు తుపాకీ పట్టుకుని నిల్చున్నారు హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్. ఆ గుడి నాలుగు వందల ఏళ్ల క్రితం నాటిది. ఆ గుడికి హీరో ఎందుకు వెళ్లాలనుకుంటాడు? అనేది తెలుసుకోవడానికి కాస్త సమయం ఉంది. బెల్లంకొండ సాయిశ్రీనివాస్ హీరోగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో మహేశ్ చందు ఓ సినిమాను నిర్మిస్తున్నారు. దివంగత ప్రముఖ దర్శకులు కోడి రామకృష్ణ 75వ జయంతి, హీరో శ్రీనివాస్ ఇండస్ట్రీలోకి నటుడిగా వచ్చి పదేళ్లు పూర్తి కావడం... ఈ రెండు సందర్భాలను పురస్కరించుకుని ఈ సినిమాను మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ''ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. జూలై 24న రెండో షెడ్యూల్‌ను మొదలు పెట్టనున్నాం. కమర్షియల్ అంశాలతో కూడిన శక్తివంతమైన, ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు లుధీర్'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

సరికొత్తగా కనిపిస్తాను - రక్షిత్ అట్లూరి



''పలాస 1978, నరకాసుర' చిత్రాల తర్వాత అన్నీ సీరియస్ రోల్స్ చేస్తున్నానని చాలామంది అన్నారు. కానీ 'ఆపరేషన్ రావణ్, శశివదనే' సినిమాల్లో నా పాత్రలు సీరియస్‌గా ఉండవు. ఈ సినిమాల్లో సరికొత్తగా కనిపిస్తాను. 'ఆపరేషన్ రావణ్' నన్ను ప్రేక్షకులకు మరింత దగ్గర చేసే సినిమా అవుతుంది'' అని రక్షిత్ అట్లూరి అన్నారు. వెంకట సత్య దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జంటగా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 26న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ– ''యువ ప్రేక్షకులకు చేరువ అయ్యేలా థ్రిల్లర్ మూవీ నిర్మిస్తే బాగుంటుందని 'ఆపరేషన్ రావణ్'ని తీశాం. ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో మా నాన్న వెంకట సత్యంగారి డైరెక్షన్ పట్ల నాతో పాటు రాధిక, చరణ్ రాజ్‌గార్లు కూడా సంతోషంగా ఫీలయ్యారు. ఈ సినిమాలో మనలోని ఆలోచనల అంతర్యుద్ధాన్ని చూపించే ప్రయత్నం చేశాం. ఇలాంటి థ్రిల్లర్ సినిమాను థియేటర్‌లో చూస్తేనే ఆ అనుభూతి కలుగుతుంది. ప్రస్తుతం 'పలాస 2' స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది'' అన్నారు.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

రాజ్ తరుణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'పురుషోత్తముడు'. హాసినీ సుధీర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ప్రకాశ్‌రాజ్, మురళీ శర్మ, రమ్యకృష్ణ, బ్రహ్మానందం, ముఖేష్ ఖన్నా ఇతర కీలక పాత్రల్లో నటించారు. రామ్ భీమన దర్శకత్వంలో డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ భీమన మాట్లాడుతూ– ''దర్శకుడిగా నేను 'ఆకతాయి, హమ్ తుమ్' అనే రెండు సినిమాలు చేశాను. ఆ తర్వాత ఆరేళ్లకు నాకు 'పురుషోత్తముడు' చాన్స్ వచ్చింది. విజయం సాధించాలనే పట్టుదలతో ఈ సినిమా చేశాను'' అన్నారు. ''మంచి క్లీన్ ఎంటర్‌టైనర్ మూవీ తీశామని గర్వంగా చెప్పగలం'' అన్నారు రమేశ్ తేజావత్. ''పురుషోత్తముడు'లో మంచి పోలీసాఫీసర్ రోల్ చేశాను. ఈ సినిమా సక్సెస్ కావాలి'' అన్నారు బ్రహ్మానందం. ''ఈ సినిమాలో నటించడాన్ని ఆస్వాదించా. రాజ్ తరుణ్ ఈ ప్రెస్‌మీట్‌కు రాలేదు. త్వరలోనే ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడతారు'' అన్నారు రాజా రవీంద్ర. ''నాది మహారాష్ట్ర. నన్ను తెలుగు అమ్మాయిలా ఆదరించాలని కోరుకుంటున్నాను. ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాని అందరూ థియేటర్స్‌లో చూస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు హాసినీ సుధీర్.


హాసినీ సుధీర్